1

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నిజామాబాద్-కామారెడ్డి

మంగళవారం | జూన్ 18, 2024 | www.navatelangana.com

నాట్య ప్రదర్శనలో చిన్నారుల ప్రతిభ

నవతెలంగాణ-బాల్కొండ

భారత్ ఆర్ట్స్ అకాడమీ జయహెూ తెలంగాణ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ ఉత్సవాలు రవీంద్ర భారతి హైదరాబాద్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా శివం డ్యాన్స్ అకాడమీ బాల్కొండ గ్రూప్ చిన్నారులు నాట్య ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాట్య ప్రదర్శన చేసిన శివం డాన్స్ గ్రూప్ చిన్నారులకు నిర్వాహకులు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాట్య గురువు గుజరతి స్వాతి, చిన్నారులు అగ్రతి, సాత్విక, కీర్తన, శ్రీమహేశ్వరీ, సహస్ర, సంజన, నిత్య శ్రీ, ఆద్య శ్రీ, మిథున పాల్గొన్నారు.



ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు సత్యశోధక్ జట్టు

నవతెలంగాణ-సిరికొండ

కర్నాటక రాష్ట్రం బెంగుళూరులో జరిగే జాతీయ స్థాయి మేజర్ లీగ్ బేస్ బాల్ ఇండియా-2024 కప్ పోటీలకు సత్యశోధక్ పాఠశాల జట్టు సోమవారం బయలుదేరింది. ఈ నెల 19 నుంచి 23 వరకు జరిగే ఈ పోటీల్లో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల తరఫున సత్యశోధక్ పాఠశాల జట్టు పాల్గొననుంది. ఈ జట్టులో పాఠశాలకు చెందిన పి. హేమంత్, డి.శ్రీకాంత్, కె.హర్షవర్ధన్, జి.విశాల్, డి.అన్వేష్, బి.తిరుపతి, యస్ . స్నేహిత్, కే శ్రీకాంత్ ,బి.సాత్విక్, జి.ప్రదీప్, బి హర్షిత్, కె. అజయ్, కోచ్ మేనేజర్లుగా అనికేత్,సంతోష్, అనిల్ లు వ్యవహరించనున్నారు. జాతీయ స్థాయికి పోటీలలో పాల్గొను క్రీడాకారులకు అవసరమైన క్రీడా పరికరాలను కిట్లను పాఠశాలలో ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య అందించి అభినందించారు. క్రీడా స్ఫూర్తి చాటుతూ ఆటలో మంచి నైపుణ్యత ప్రదర్శించి జాతీయ స్థాయి పోటీలలో రాణించాలని సూచించారు.



ధరల ఘాటు

- ఒకవైపు పెరిగిన కూరగాయల ధరలు
- మరో వైపు చికెన్ ధరకు రెక్కలు
- గుడ్డుకు గడ్డు కాలం
- పప్పు, చింతపండు ధరలు సైతం పైపైకి
- అకాశాన్నంటిన నిత్యావసరాలు
- సామాన్యుడిపై తీవ్ర ప్రభావం

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్





నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఉప్పు పప్పులతో పాటు కూరగాయలు, చికెన్ గుడ్ల ధరలు పోటాపోటీగా పెరుగుతూ సామాన్యుడి జేబుకు చిల్లుపెడుతున్నాయి. గతంలో కొన్ని వస్తువుల ధరలు పెరిగితే మరికొన్నింటివి తగ్గేవి. అయితే ఈసారి అలా కాకుండా ప్రతిదీ పెరగడంతో 'ఏం కొనేటట్టు లేదు.. ఏం తినేటట్టు లేదు' అన్న పరిస్థితి నెలకొంది. ప్రతేడాది పంటలు చేతికివచ్చే సమయంలో ధరలు పెరగడం సాధారణం. అయితే గతేడాదితో పోల్చితే ఈసారి ధరలు మరింతగా పెరగడంతో సామాన్యులు గగ్గోలు పెడుతున్నారు.

పల్లెటూరాల్లో సైతం కూరగాయలు, నిత్యావసర వస్తువుల ధరలు భగ్గుమంటున్నాయి. రూ.500 తీసుకుని అంగడికి వెళ్లినా బస్తానిండని పరిస్థితి. ఒక్క కూర గాయల ధరలు మాత్రమే కాదు పప్పులు, ఇతర నిత్యావసర వస్తువుల ధరలు కూడా భగ్గుమంటున్నాయి. కొన్ని రోజుల కింద అందుబాటులోనే ఉన్న కూరగాయల ధరలు ఇప్పుడు భారీగా పెరిగాయి. ప్రస్తుతం కూరగాయలు, నిత్యావసర వస్తువుల ధరలు చూస్తుంటే ఏం కొనేటట్టు లేదు.. ఏం తినేటట్టు లేదు అనే పరిస్థితి నెలకొంది.

సామాన్యుడిపై ధరల భారం..

గత రెండు మూడు రోజులుగా కూరగాయల ధరలు ఎండతో పాటే మండిపోతున్నాయి. గత వారం రోజుల వరకు కిలో రూ.20 ఉన్న టమాటా సోమవారం రోజున పెద్దకొడప్‌గల్ అంగళ్లలో కిలో రూ.40గా బీరకాయ కిలో రూ.80గా ఉంది. ఎప్పుడూ తక్కువ ధరకు దొరికే ఆలుగడ్డ కిలో రూ.60 వంకాయ కిలో రూ.80, పచ్చి మిర్చి కిలో రూ.100, బెండకాయ రూ.80, దొండకాయకు రూ.80బీన్స్ కిలో రూ.120,ఉన్న క్యాప్సికం రూ.80 చిక్కుడు కిలో రూ.80ఉంది.

ఆకుకూరలూ అంతే..

చిన్న కొత్తిమీర కట్ట రూ.10,తోటకూర రూ.20కి రెండు చిన్న కట్టలు, పాలకూర,చుక్కకూర,పాయల్ కూరలు సైతం రూ.80 కి కిలో ఇచ్చారు. నిమ్మకాయల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. రూ.20కి నాలుగు నిమ్మకాయలు ఇస్తుండగా, చిన్నవి అయితే 5 అల్లం కిలో రూ.200 ఉంటే ఎల్లిగడ్డ రూ.320 పలుకుతోంది. చింతపండు కూడా రూ.120 నుంచి రూ.140కి అమ్ముతున్నారు.

గుడ్డుకు గడ్డు కాలమే

పల్లెల్లో ప్రజలు గుడ్డు తినేందుకు కూడా గడ్డు కాలం వచ్చిందని అనుకుంటున్నారు. రూ.5ఉన్న కోడిగుడ్డు ఇప్పుడురూ.7కు చేరింది.

కూరగాయలపై భానుడి ప్రభావం

ఈ సారి ఎండలు మండిపోతున్నాయి. భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. ఎండలతో చాలా ఏరియాల్లో గ్రౌండ్ వాటర్ తగ్గడంతో అన్నదాతలు వేసిన పంటలకు దిగుబడి రావడం లేదు. దీంతో ఉత్పత్తి తగ్గడం అదే తరుణంలో డిమాండ్ పెరగడం వల్ల ధరలు పెరిగిపోతున్నాయి.పెరిగిన ధరలతో జన జీవనం దినదిన గండంగా మారుతుంది. నెలనెలా వచ్చే జీతానికి, పెరుగుతున్న ధరలకు ఎక్కడా పొంతన లేకుండా పోతుందని, ఇలా అయితే సామాన్యుడి జీవనం మరింత భారం అవుతుందని ప్రజలు ఒకరితో ఒకరు చర్చించుకుంటున్నారు.

పప్పుల ధరలు పైపైకి..

పప్పుల ధరలు ఎన్నికల తర్వాత అమాంతం పెరిగాయని సామాన్యులు అంటున్నారు. పప్పుల రేట్లు గతంలో కంటే ఎక్కువగా పెరిగాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొన్నటి వరకు కిలో రూ.110 నుంచి 120 పలికిన కందిపప్పు ఇప్పుడు రూ.200కు చేరింది. శనగపప్పు రూ.90 నుంచి 100, పెసరపప్పు రూ.140, మినపప్పు 140 నుంచి150 అయింది.



చికెన్ ఏం తక్కువ కాదు

నాన్వెజ్ ధరలు కూడా భారీగా పెరిగాయి.పెండ్లిల సీజన్ కూడా కానప్పటికి నాన్వెజ్ ధరలకు సైతం రెక్కలొచ్చాయి. ఎండల వేడిమికి చికెన్ ధరలు అమాంతం తగ్గిపోతుంటాయి. కానీ ఈ సారి మాత్రం ధరలు అందుకు భిన్నంగా ఉన్నాయి. సోమవారం రోజున స్కిన్ లెస్ చికెన్ కిలో రూ.300కి చేరింది. గతంతో పోలిస్తే కాస్త తగ్గినా ఎప్పుడు పెరుగుతుందో, ఎప్పుడు తగ్గుతుందో తెలియదని చికెన్ షాప్ యజమానులు అంటున్నారు. గతంలో కిలో రూ.700 ఉన్న మటన్ ఇప్పుడు కిలో రూ.800కి పెరిగింది. దీంతో పండుగలు, ఫంక్షన్లు అంటేనే సామాన్య ప్రజానీకం హడలి పోతున్నారు.





నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

త్యాగానికి ప్రతీక.. బక్రీద్

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేడుకలు
- ఈద్గాల్లో ప్రార్థనలు చేసిన ముస్లింలు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

త్యాగానికి ప్రతీకగా నిర్వహించుకునే బక్రీద్ పండుగను ముస్లింలు సోమవారం (ఈద్ ఉల్ అదా) ఘనంగా నిర్వహించుకున్నారు. మసీదులు, ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఇళ్లల్లో ఖుర్బానీ నిర్వహించి సంబరంగా పండగను నిర్వహించుకున్నారు. సమానత్వం, సేవా దృక్పథం, త్యాగనిరతికి ప్రతీకగా బక్రీద్ వేడుకలు నిర్వహించారు. జిల్లా కేంద్రంతో పాటు పట్టణాలు, గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేపట్టింది. కాగా ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు.



హరితహారం చెట్ల నరికివేత

నవతెలంగాణ-నంది పేట్

ఆకుపచ్చ తెలంగాణ లక్ష్యంగా గత ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మంగా ప్రారంభించింది. మొక్కలను నాటి అవి ఏపుగా పెరిగే వరకు సంరక్షణ చర్యలు తీసుకున్నది. ముళ్ళకంచలు వేసి మొక్కలు పశువులకు మేతగా మారకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నది. ఈ నేపథ్యంలో మండలంలోని కుద్వాన్‌పూర్ గ్రామ ముఖద్వారం వద్ద రోడ్డుకు ఇరువైపులా చెట్లను నాటారు. అవి కాస్త పెరిగి బాటసారులకు నీడనిస్తున్నాయి. అయితే కొందరు వ్యక్తులు ఓ వైపున ఉన్న చెట్లను నరికి వేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. పలు గ్రామాల్లో ఇలా చెట్లను నరికి వేస్తున్న దృశ్యాలే దర్శనమిస్తున్నాయి. గ్రామ ముఖద్వారం వద్ద ఉన్న పంచాయతీ సిబ్బందికి మాత్రం చెట్లను నరికి వేయడం కనబడడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు నిర్లక్ష్యపు నీడలు కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా చెట్లను నరికి వేయకుండా కాపాడాలని తగు జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



రోడ్డు పక్కన చెట్లు నరికివేసిన దృశ్యం

నీట్ లీకేజీపై 19న స్టూడెంట్ మార్చ్

- విజయవంతం చేయండి : విద్యార్థిసంఘాల పిలుపు



మాట్లాడుతున్న విద్యార్థిసంఘాల నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రస్తుత విద్యా సంవత్సరంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన నీట్ ఫలితాలపై, పేపర్ లీకేజీలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి చేత విచారణ జరిపించి విద్యార్థులకు న్యాయం చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీపై 19న తలపెట్టిన 'స్టూడెంట్ మార్చ్'ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యాలయంలో నీట్ విద్యార్థులకు న్యాయం చేయాలని విద్యార్థి సంఘాలు (ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ, ఏఐఎస్ఎఫ్, పిడిఎస్‌యూ, పీడీఎస్‌యూ) గా ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విఘ్నేష్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్య క్షులు వరద బట్టు వేణురాజ్ మాట్లాడారు.

దేశవ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలలో చదవడానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన నీట్ పరీక్ష ఫలితాలపై అనేక అనుమానాలు వెలు వడుతున్న తరుణంలో పరీక్ష నిర్వహించిన తీరుపై కేంద్ర ప్రభుత్వం సమగ్ర విచారణ చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా దేశవ్యాప్తంగా 24 లక్షల మంది విద్యార్థులు పరీక్షను రాశారు. ప్రకటించిన ఫలితాల్లో అనేక అవకతవకలు జరిగాయని విద్యార్థులు, విద్యార్థి తల్లిదండ్రులు అనుమా నాలు వ్యక్తం చేస్తున్నారు. వారి అనుమానాలకు సజీవ సాక్ష్యం ఆరుగురు విద్యార్థులకు 720 మార్కులకు 720 మార్కులు రావడం మరల వారి పరీక్ష కేంద్రం ఒకటే కావడం వలన వారి అనుమానాలకు బలాన్నిస్తుంది. కావున తక్షణమే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన ఫలితాలపై కేంద్ర ప్రభుత్వం స్పందించి పరీక్ష రాసిన మెడికల్ విద్యార్థులకు న్యాయం చేయాలని అన్నారు. అదేవిధంగా రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసే నీట్ పరీక్షను రద్దు చేయాలనీ దక్షిణాది రాష్ట్రాల ముఖ్య మంత్రులు కేంద్ర ప్రభుత్వానికి చెప్పిన కూడా వారి మాటని పెడచెవిన పెట్టి, నిర్లక్ష్యం చేయడం ద్వారా వేలాది మంది ప్రతిభగల విద్యార్థులు మెడికల్ విద్యకు దూరమవుతున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన ఫలితాలపై, పేపర్ లీకేజీలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి చేత విచారణ జరిపించాలని అన్నారు. లీకేజ్ బాధితులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలి డిమాండ్ చేశారు. ఈ నెల 19న తలపెట్టిన విద్యార్థి మార్చ్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు నరేందర్, జిల్లా కార్యదర్శి డాక్టర్ కర్క గణేష్, ఏఐపీఎస్‌యూ జిల్లా కార్యదర్శి అనిల్, విద్యార్థి సంఘాల నాయకులు నితిన్‌రెడ్డి, ప్రసాద్, అనిల్ తదితర నాయకులు పాల్గొన్నారు.

పాలకులు మారినా.. సమస్యలు తీరట్లే

ఎస్సీ కాలనీలో 15 రోజులుగా వెలగని బల్బు

నవతెలంగాణ-బోధన్



చిమ్మచీకట్లు కమ్ముకున్న సాలూరలోని ఎస్సీవాడ

సాలూర మేజర్ గ్రామ పంచాయతీ సిబ్బంది పనితీరు జనం ఛీదరించుకునేలా తయారయింది. సాలూర ఎస్సీ కాలనీలో గత 15 రోజులుగా పలు చోట్ల విద్యుత్ దీపాలు పాడయి చీకటిగా మారింది. దాంతో పలుమార్లు పంచాయతీ సిబ్బందికి విద్యుత్ బల్బులు బిగించేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరారు. రేపు, మాపు అంటు రోజులు గడుపుతున్నారు కాని బల్బులు బిగించడం లేదు. దాంతో కాలనీలో పలుచోట్ల జనం చీకటిలోనే ఉండే పరిస్థితి ఏర్పడింది. చీకటిలో విష సర్పాలు, తేళ్లు వస్తున్నాయని పలువురు వాపోయారు. కొన్ని చోట్ల తాగునీటి కుళాయిలకు అస్సలు నీరు రావడం లేదు. మురికి కాలువలు మురికితో దుర్వాసన వస్తున్న పట్టించుకోవడం లేదని ఈ సమస్య పరిష్కరించాలని కోరిన పంచాయతీ సిబ్బంది పట్టించుకోవడం లేదు అని ఆరోపణలు వస్తున్నాయి.

ఎవరికి వారే యమునాతీరే అన్న చందంగా సాలూర పంచాయతీ తయారయిందని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. కనీసం ఏనాడు కూడా ప్రత్యేకాధికారి కాలనీ సమస్యలపై దృష్టి సారించడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై గ్రామ పంచాయంశ ప్రత్యేకాధికారి సాలూర మండల తహశీల్దార్ రమేష్‌ను వివరణ కోరగా త్వరలో పంచాయతీ సమావేశం ఏర్పాటుచేసి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని తెలిపారు.

గృహజ్యోతి వర్తించట్లేదు..

- విద్యుత్ ప్రజావాణిలో పలువురి మొర
- నిజామాబాద్‌లో 21 ఫిర్యాదులు, కామారెడ్డి జిల్లాలో 22 వినతులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



నిజామాబాద్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న అధికారులు

విద్యుత్ సమస్యలపై జిల్లా వ్యాప్తంగా తొలిసారి నిర్వహించిన స్పందన వచ్చింది. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 21 ఫిర్యాదులు అందగా, కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 22 వినతులు అందినట్టు అధికారులు తెలిపారు. సోమవారం జిల్లా వ్యాప్తంగా సబ్‌స్టేషన్‌లు, విద్యుత్ కార్యాలయాల్లో ప్రజావాణి నిర్వహించారు. అయితే ఎక్కువగా గృహజ్యోతి వర్తించడం లేదనే ఫిర్యాదులు అధికంగా వచ్చినట్టు అధికారులు తెలిపారు.

మొదటి విద్యుత్ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా 21 ఫిర్యాదులు వచ్చాయి. అందులో నిజామాబాద్ డివిజన్‌కు 2 ఫిర్యాదులు, బోధన్ డివిజన్ లో 09 ఫిర్యాదులు, ఆర్మూర్ డివిజన్ లో 05 ఫిర్యాదులు, డిచ్ పల్లి డివిజన్ లో 05 ఫిర్యాదులు వచ్చాయని టీజీ ఎన్పీడీసీఎల్ ఎస్ ఈ ఆర్ రవీందర్ తెలిపారు. ముఖ్యంగా ఈ ఫిర్యాదులలో గృహజ్యోతి వర్తించడం లేదనే సమస్య పైననే ఉన్నాయని, మరికొన్ని సరియైన సక్రమమైన విద్యుత్ బిల్లు జనరేట్ కావడంలేదనే అంశం పైన ఫిర్యాదుల వచ్చాయని తెలిపారు. బిల్ జనరేట్ కావడం లేదు అనే అంశాలని ఇక్కడే పరిష్కరించినట్టు తెలిపారు. గృహజ్యోతికి సంబంధించిన విద్యుత్ బిల్లుల అంశంపై ఉన్నతాధికారులకు పంపించాము.

కామారెడ్డిలో 22 ఫిర్యాదులు

కామారెడ్డి : చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి(ఐఏఎస్) ఆదేశాల మేరకు ప్రతి సోమవారము విద్యుత్ సమస్యలపై ఆర్జీలను స్వీకరించడానికి విద్యుత్ ప్రజావాణిని ప్రతి సెక్షన్ ఆఫీసులో, సబ్ డివిజన్ ఆఫీసులో, డివిజన్ ఆఫీసులలో , విఆర్ఓ కార్యాలయాలలో ఉదయం 10:00 నుండి 1:00 వరకి, ఏస్ ఈ కార్యాలయంలో మధ్యాహ్నం మూడు గంటల నుండి ఐదు గంటల వరకు నిర్వహించినట్టు అధికారులు తెలిపారు.

ఈ సందర్భంగా సోమవారం జిల్లావ్యాప్తంగా నిర్వహించిన విద్యుత్ ప్రజావాణిలో విద్యుత్ సమస్యలపై 22 ఆర్జీలను స్వీకరించడం జరిగిందనీ, వీటన్నిటిని పరిశీలించి త్వరలోనే పూర్తి చేస్తామని ఏస్ ఈ రమేష్ బాబు అన్నారు. వినియోగదారులందరూ విద్యుత్ ప్రజావాణి వేదికగా తమ విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకువచ్చి సమాధానాలు పొందాలని కోరారు.

విద్యుత్ సమస్యలు తీర్చుతాం

మోపాల్ : మండల కేంద్రంలో గల తానాకుర్ధి సబ్ స్టేషన్ లో సోమవారం రోజున మోపాల్ మండల్ ఎలక్ట్రిసిటీ అసిస్టెంట్ ఇంజనీర్ బాబా శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యుత్ ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తమ పరిధిలోకి ఏ సమస్య వచ్చినా కూడా తీర్చే విధంగా చూస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు సత్వరమే పరిష్కారం : ఏఈ జగదీశ్వర్

ధర్పల్లి : విద్యుత్ ప్రజావాణిలో భాగంగా ప్రతి సోమవారం విద్యుత్ వినియోగదారుల సమస్యలు సత్వరమే పరిష్కరించనున్నట్టు ఏఈ జగదీశ్వర్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులు తమ సమస్యలు ఏమైనవుంటే ప్రతి సోమవారం మండలకేంద్రములోని సబ్ స్టేషన్ లో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఫిర్యాదు తమకు అందిన వెంటనే తమ సిబ్బంది పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో సబ్ ఇంజనీర్ గౌతమ్, ఆయా గ్రామాల జెఎల్ఎంలు, ఏఎల్ఎంలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



కామారెడ్డి జిల్లా కేంద్రంలో వినతులు స్వీకరణ..



మోపాల్ మండలం తానాకుర్దులో..



ధర్పల్లి మండల కేంద్రంలో..

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
2
మంగళవారం | జూన్ 18, 2024 | www.navatelangana.com

శ్రీశ్రీకి నివాళి



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

శ్రీశ్రీ వర్ధంతి నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిజామబాద్ జిల్లాకేంద్రంలోని న్యూ అంబేద్కర్ భవన్ శ్రీశ్రీ యాదిలో సభ నిర్వహించారు. ముందుకు శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లు అర్పించారు. ఈసందర్భంగా ప్రొఫెసర్ ఖాసీం, మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ నీతు కిరణ్, ప్రముఖ కవి బిఎస్ బి, సయ్యద్ రియాజ్ తన్న ప్రముఖ కవులు మాట్లాడారు. సభలో అరుణోదయ దాసు, హిందూ సాయిబాబా, శ్రీనివాస్ ఆర్య, పాల్గొన్నారు. కవి సమ్మేళనంలో కవులు పాల్గొని కవితలు వినిపించారు. శ్రీశ్రీ పాటలతో సభ ఉత్తేజపూరితంగా జరిగింది.

ఆలయ నిర్మాణానికి విరాళం అందజేత



విరాళం అందజేస్తున్న శ్రీనివాస్

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ వాస్తవ్యులు రమదేవి ట్రేడర్స్ యజమాని పొన్న శ్రీనివాస్ రూ.11,116, గద్దల నర్సయ్య రూ.5,011 రూపాయలను అమ్మవారి ఆలయ నిర్మాణం కోసం తనవంతు ప్రయత్నంగా ఆలయ కమిటీ సభ్యులకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ట్రస్టు సభ్యులు విరాళం అందజేసిన వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. మరి కొంతమంది దాతలు ఆలయ అభివృద్ధి కోసం ముందుకు రావాలని కమిటీ సభ్యులు కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఎర్రోళ్ల విజయ్, కంచు గంగాధర్, బొట్ల చిన్న రాజన్న, గొర్రె చిన్న రాజన్న, కల్లు స్వామి, గోపు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే



నివాళ్లు అర్పిస్తున్న ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ పాలెపు రాజు తండ్రి పాలెపు చిన్న రెడ్డి ఇటీవల మరణించడంతో ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి సోమవారం వారి స్వగృహం పెర్కిట్‌కు వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో కంచెట్టి గంగాధర్, ద్యాగ ఉదయ్, భారత్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డినిని కలిసిన అర్బన్ ఎమ్మెల్యే

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

న్యూఢిల్లీ శాస్త్రిభవన్‌లో బొగ్గు, గనుల శాఖ కార్యాలయంలో తెలంగాణ నుండి నూతనంగా బొగ్గు గనుల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన గంగాపురం కిషన్ రెడ్డిని అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నిబద్ధతో పార్టీ సిద్ధాంతలకు కట్టుబడి పని చేస్తే పార్టీ గుర్తిస్తుందనడానికి కిషన్ రెడ్డినే నిదర్శనం అని, గతంలో కేంద్ర హెూం సహాయమంత్రిగా, పర్యాటక శాఖ మంత్రిగా, రాష్ట్ర అధ్యక్షులుగా పనిచేశారని అన్నారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని, మోదీ 3.0లో తెలంగాణ నుండి ఇద్దరికీ అవకాశం కల్పించినందుకు మోడీకి పార్టీ పెద్దలకు ఈ సందర్భంగా ప్రతేక ధన్యవాదములు తెలపారు.

లేబర్ కార్డులను సద్వినియోగం చేసుకోండి



లేబర్ కార్డులు అందజేస్తున్న లేబర్ ఆఫీసర్

నవతెలంగాణ-ఆర్మూర్

భవన నిర్మాణ కార్మికులు లేబర్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలని లేబర్ ఆఫీసర్ మనోహర్ అన్నారు. పట్టణంలో ఆర్మూర్ తాలూక మేషన్స్ సంఘం ఆధ్వర్యంలో సోమవారం లేబర్ కార్మికులకు తెలంగాణ భవన, నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ఐడి కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికులకు ఈ కార్డులు ఎంతగానో ఉపయోగపడతాయని కార్మికులకు పూర్తిగా వివరించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు గుమ్మల మధు, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి దొంగల దోపిడి


నవతెలంగాణ-సిరికొండ

సిరికొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని న్యావనంది గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి దొంగలు 18 తులాల బంగారం దోచుకెళ్లినట్లు ఏఎస్ఐ బాల్ సింగ్ తెలిపారు కుటుంబ సభ్యులు అందించిన వివరాల ప్రకారం.. న్యావనంది గ్రామంలోని ఘణపురం శ్యామల రామచందర్ పక్క గ్రామమైన రావుట్లలో తమ బంధువులలో ఒకరు చనిపోయారని అంత్యక్రియలకు వెళ్లి అక్కడే ఉన్నారు. వారి కుమారులు ఇద్దరు రాత్రి సమయంలో ఒకటో అంతస్తులో పడుకున్నారు. ఉదయం లేచి చూసేసరికి తలుపు తెరిచి ఉండటం గమనించి పోలీస్ లకు సమాచారం అందించారని అన్నారు. ఘటన స్థలానికి డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్ తో పోలీసులు వెళ్లారు. ఘనపురం శ్యామల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ తెలిపారు. గత నాలుగు సంవత్సరాలనుండి ప్రతి యేటా న్యావనంది గ్రామంలో దొంగలు పడుతున్నారని గ్రామస్థులు తెలిపారు గ్రామంలో మరోమారు దొంగతనాలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని పోలీసులను గ్రామస్తులు కోరుతున్నారు.

పవిత్రతకు మారుపేరు.. సిద్దుల గుట్ట

- జిల్లా కోర్టు సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి

నవతెలంగాణ-ఆర్మూర్



సిద్దుల గుట్టను సందర్శించుకున్న సివిల్ జడ్జి

సిద్దుల గుట్టపై పురాతన కాలంలో తొమ్మిది మంది సిద్దులు తపస్సు చేసిన చరిత్ర ఉందని, అందుకే నవనాథ సిద్దుల గుట్టగా ప్రసిద్ధి చెందింది. జిల్లా కోర్టు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, కోర్టు సీనియర్ సివిల్ జడ్జి పి. పద్మావతి అన్నారు. కుటుంబ సభ్యులతో సోమవారం దర్శించుకున్నారు. పట్టణంలోని ప్రసిద్ధ పుణ్య క్షేత్రం సిద్దుల గుట్టపై నెలకొన్న స్వయంభూ శివలింగం యొక్క ప్రాముఖ్యత, మహత్యం తెలుసుకుని దర్శనానికి వచ్చానని వచ్చారు. ఇక్కడగల స్వయం భూ శివలింగానికి పంచామృతాలతో అభిషేకాలు చేసి పురోహితులు కుమార శర్మ నేతృత్వంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ పవిత్ర సిద్దుల గుట్ట మహత్యం చాలా గొప్పది, దర్శనానికి కుటుంబ సభ్యులతో వచ్చామని, గుట్టపై అద్భుతంగా ఉందని, చాలా అభివృద్ధి జరుగుతున్నదని అన్నారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో న్యాయమూర్తి కి శాలువాతో సన్మానించారు.కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది, కోర్టు పి పి శ్రీనివాస్ ఖాండేష్, న్యాయ సిబ్బంది, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు

టీయూకు రెగ్యులర్ వీసిని నియమించాలి

- విద్యాశాఖ మంత్రిని ఎప్పుడు నియమిస్తారు.?
- పీడీఎస్‌యూ



సమావేశంలో మాట్లాడుతున్న కర్కగణేష్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ విశ్వవిద్యాలయానికి నిజాయితీగల వారిని విసిగా నియమించాలని పిడిఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యూ ఆధ్వర్యంలో నిజామాబాద్ నగరం నీలం రామచంద్రయ్య భవన్‌లో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం రెగ్యులర్ వీసి లను నియమించకుండా మళ్ళీ ఐఎఎస్ ఆఫీసర్స్ ను ఇంచార్జీలుగా నియమించడం సరైంది కాదని, సెర్చ్ కమిటీల పేరిట కాలయాపన చేయవద్దని, గత ప్రభుత్వ పాలకులు అన్ని యూనివర్సిటీలను భ్రష్టు పట్టించారని అన్నారు. గత సీఎం విశ్వవిద్యాలయలను పట్టించుకోకుండా విధ్వంసం చేశారని, యూనివర్సిటీలను రక్షించాల్సిన బాధ్యత అధిక నిధులు కేటాయించాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వాన్నిదే అని అన్నారు. గతంలో యూనివర్సిటీలను ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమే అని అదే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చింది కావున తెలంగాణ యూనివర్సిటీకి వంద కోట్లు కేటాయించి అభివృద్ధికి పాటుపడాలని, వీసి అవినీతికి పాల్పడిని యూనివర్సిటీని ప్రక్షాళన చేయలేదని అన్నారు. యూనివర్సిటీల మీద ప్రభుత్వం చిత్తశుద్ధి చూపాలని, యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్‌పైన పట్టు, పరిశోధనల మీద నైపుణ్యత, నిజాయితీగలవారిని విసిగా నియమించాలని, విద్యాశాఖ మంత్రిని నియమించాలనీ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ప్రిన్స్,నాయకులు రాజేష్ , అరుణిక, అబిగ్న ,రాజు తదితరులు పాల్గొన్నారు.

నీట్ పరీక్షపై సమగ్ర విచారణ చేయాలి

- సీపీఐ



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నీట్ పరీక్షలపై సమగ్ర విచారణ జరిపి విద్యార్థులకు న్యాయం చేయాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం సిపిఐ జిల్లా కార్యాలయంలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ మాట్లాడుతూ నీట్ యూజీ పరీక్ష వ్యవహారంలో కేంద్రంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి విద్యార్థులకు న్యాయం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కష్టపడి చదివిన విద్యార్థులకు నష్టం జరగకుండా చూడాలని అన్నారు. బీహార్ లో రూ.30 లక్షలకు నీట్ ప్రశ్నాపత్రం విక్రయించారని, కొద్దిమందిని, అరెస్టు చేసినట్టు వార్తలు వస్తున్నాయని అన్నారు. నీట్ పరీక్ష వ్యవహారంలో ఆరోపణలు అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నప్పటికీ ప్రధాని మోడీ స్పందించకపోవడం దారుణం అన్నారు. ఇప్పటికైనా కేంద్రంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం నీట్ పరీక్ష వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో సిపిఐ జిల్లా నాయకులు పి రంజిత్, బి రఘురాం, పి హనుమన్లు, అంజలి, రాధాకుమార్, వంశీ పాల్గొన్నారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంస

- మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో



పురస్కారాలు అందుకున్న విద్యార్థులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ మున్నూరు కాపు ప్రభుత్వ, విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం నిజామాబాద్ జిల్లా ఆధ్వర్యంలో పదవ తరగతి, నీట్ జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ కనబరిచిన మున్నూరు కాపు విద్యార్థులకు బంగారు పథకాలతో పాటు ప్రశంసా పత్రంతో సన్మానించారు. ముందుగా అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలుత నివేదికను సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ అబ్బ పూర్ రవి వివరించి, విద్యార్థుల ప్రగతిని ప్రోత్సహించేందుకే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నగర మేయర్ నీతు కిరణ్ మాట్లాడుతూ.. విద్యార్థులను ప్రోత్సహించేందుకు మున్నూరు కాపు ఎంప్లాయిస్ సంఘం ముందుకు రావడం అభినందనీయమని, ఇలాంటి సేవా కార్యక్రమాలు అందరికీ ఆదర్శంగా నిలుస్తాయని, విద్యార్థులు చదువుపై దృష్టి సరించి తమ మేధాశక్తిని పెంచుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు, నా వంతుగా సంఘం సేవలందించేందుకు సహాయపడేందుకు తోడ్పాటు అందిస్తామని అన్నారు. గౌరవ విశిష్ఠ అతిథిగా మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత మాట్లాడుతూ తొలిసారి జిల్లా కేంద్రంలో మున్నూరు కాపుల ఐక్యతను చాటేందుకు ఉద్యోగుల సంఘం విద్యార్థులకు పురస్కారాలను అందజేయడం నిజంగా గొప్పతనం అన్నారు. ఇలాంటి కార్యక్రమాలకు తన వంతుగా సహాయ సహకారం అయిన అందిస్తానని అన్నారు. ఆర్మూర్ మున్సిపల్ చైర్మన్ వన్నెల్ దేవి లావణ్య మాట్లాడుతూ భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలకు ముందుకు సాగాలని ఆశ భావం వ్యక్తం చేశారు. గౌరవ అతిథిగా జిల్లా మున్నూరు కాపు సంఘం కోశాధికారి ధర్మపురి సురేందర్ మాట్లాడుతూ.. ఉద్యోగుల సంఘం విశిష్ట సేవలను అందించేందుకు తొలి అడుగు వేసింది అన్నారు. ఈ కార్యక్రమాలకు జిల్లా మున్నూరు కాపు సంఘం తరపున అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవి అబ్బా పూర్ పటేల్, గౌరవ అధ్యక్షులు ఆంజనేయులు పటేల్, ముఖ్య సలహాదారు ఆకుల ప్రసాద్ పటేల్, జిల్లా కోశాధికారి భాసెట్టి సురేష్ పటేల్, మహిళ కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అతిథులతో విద్యార్థు లకు గోల్డ్ మెడల్, సిల్వర్ మెడల్స్ తో పాటు ప్రశంసా పత్రంతో సన్మానం చేశారు. 90 మంది విద్యార్థులకు ప్రతిభ అవార్డులతో సత్కరించారు, వారి తల్లిదండ్రులు, సంఘం సభ్యులు పట్టణంలోని 16 సంఘాల అధ్యక్షులు 400 మంది పాల్గొన్నారు.

గుండె శస్త్రచికిత్సలు విజయవంతం

- మెడికవర్ ఆస్పత్రి ఇంఛార్జి స్వామి



మాట్లాడుతున్న వైద్యులు స్వామి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

జిల్లా కేంద్రంలోని మెడికవర్ ఆసుపత్రిలో గుండె శస్త్రచికిత్సలు 10వేలకు పైగా విజయవంతంగా పూర్తి చేయడం గర్వకారణమని ఆసుపత్రి ఇంచార్జి స్వామి అన్నారు. సోమవారం నిజామాబాద్ నగరంలోని ఎల్లమ్మ గుట్టలోని మెడికవర్ ఆసుపత్రిలో గుండె వైద్య నిపుణులు సదానంద రెడ్డి, సందీప్ రావు, సంజయ్ కుమార్, అవీస్ సనర్, వనులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీనియర్ గుండె వైద్య నిపుణులు డాక్టర్ సదానంద రెడ్డి మాట్లాడుతూ మారుతున్నా జీవనశైలితో ఇప్పుడు వృద్ధులతో పాటు యువత కూడా గుండె సమస్యలతో బాధపడుతున్నారని అన్నారు. చాలా చిన్న వయసులోనే హార్ట్ అటాక్ తో చనిపోయే వారు ఇటీవల ఎక్కువగా కనిపిస్తున్నారని తెలిపారు. ఇలాంటి హార్ట్ అటాక్ సరిగ్గా గుర్తిస్తే వీలైనంత త్వరగా వైద్యసహాయం అందేలా జాగ్రత్త పడవచ్చని అన్నారు. తద్వారా మరణాలనూ నివారించవచ్చని చెప్పారు. కుటుంబ చరిత్రలో గుండె జబ్బులుండటమూ గుండెపోటుకు దారితీసే అంశమే, దాదాపు 25 శాతం మందిలో ఈ ఫ్యామిలీ హిస్టరీయే గుండెపోటుకు ఓ కారణం అని అన్నారు. ఆహారాల్లో ఎక్కువగా వాడుతున్న ఉప్పు, కొవ్వు పదార్థాలు (ట్రాన్స్ ఫ్యాట్స్), రక్తనాళాల్లో కొవ్వులు చేరేలా, సన్నబడేలా చేస్తున్నాయని అన్నారు. యువతలో శారీరక శ్రమ, వ్యాయామం లేకపోవడమూ ఓ ప్రధాన ముప్పే, వ్యాయామం చేసేవారు కూడా కొవ్వు కరిగేలా చేసుకోవడం కంటే కండరాల నిర్మాణం, మంచి ఆకృతిపైనే ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. కానీ వాకింగ్, జాగింగ్ వంటి ఏరోబిక్సు ప్రాధాన్యమివ్వడం లేదని, వ్యాయామం విషయంలో శరీరానికి తీవ్రమైన శ్రమ కలిగేలా చేయడం కంటే శ్రమలేని వ్యాయామాలే మంచివి అన్న కీలక అంశాన్నీ విస్మరిస్తున్నారని అన్నారు. యువతలో ఎక్కువ మంది ఎక్కువ గంటల పాటు, అందునా రాత్రుళ్ల నిద్రలేకుండా పనిచేసే వృత్తులో ఉండటం బాగా పెరిగిందని, దాంతోపాటు తీవ్రమైన శారీరక, మానసిక ఒత్తిడిని ఎదుర్కోవడం ఇవన్నీ గుండెపోటుకు దారితీసే అంశాలే అని వివరించారు.

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా మహేష్ ఎన్నిక



కార్యకర్తలకు ఎల్లవేళలా రాష్ట్ర కమిటీ ప్రాతినిధ్యం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 15,16 న నిర్వహించిన రాష్ట్ర ప్లీనరీ సమావేశంలో నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు పోషమైన మహేష్‌ను ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యునిగా ఎన్నుకున్నారని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిరంతరం విద్యారంగ సమస్యల పట్ల, ప్రజా సంఘ క్రమశిక్షణ పాటిస్తూ, నియమ నిబద్ధతతో పనిచేసే ఇస్తుందని పేర్కొన్నారు. ఇదే ఉత్సాహంతో పని చేస్తూ రాష్ట్ర కమిటీ నాపై ఉంచిన నమ్మకాన్ని కాపాడుకుంటూ రాష్ట్రస్థాయి నుండి దేశ స్థాయికి ఎదిగేటువంటి కార్యకర్తలని ఎంతోమందిని భవిష్యత్తులో తయారు చేసే విధంగా నా ఉద్యమ రూపకల్పన ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా నిజామాబాద్ జిల్లాలో ఉన్న ప్రభుత్వ విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, ప్రైవేట్, మోనో కార్పొరేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ధనదాహ ఆగడాలను ఎండ కొడుతూ, విద్యారంగంలో అభివృద్ధి వచ్చేంతవరకు అహర్నిశలు కృషి చేస్తానని పేర్కొన్నారు.

విద్యుత్ షాక్ తగిలి రెండు గేదెలు మృతి



మృతిచెందిన గేదెలు

నవతెలంగాణ - మాక్లూర్

మండలంలోని చిన్నపూర్ గ్రామానికి చెందిన రైతుకు చెందిన రెండు గేదెలు మామిడిపల్లి గ్రామ శివారులో విద్యుత్ షాక్ తగిలి మృతి చెందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. చిన్నాపూర్ గ్రామానికి చెందిన మాణిక్యం, భూమన్నల గేదెలు మేత మేసుకుంటు వెళ్లి స్థంభానికి గల సపోర్ట్ వైర్‌కు సర్వీస్ వైర్ తగలడంతో మేత మేస్తున్న గేదెలకు తగిలి అక్కడిక్కడే మృతి చెందినట్లు తెలిపారు. వీటి విలువ సుమారు రూ. లక్ష 20 వేలు ఉంటుందని అన్నారు. ఇదంతా కూడా విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమని అంటున్నారు. వైర్లు కిందకు వేలాడటంతో ఈ సంఘటన జరిగిందన్నారు. బాధితులకు తగిన న్యాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేటినుండి వినియోగదారుల జాతీయ సమావేశాలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఈనెల 18, 19, 20 మూడు రోజులు న్యూఢిల్లీ లో జరిగే వినియోగదారుల జాతీయ సమావేశాలకు నిజామాబాద్ నుండి ఇందూర్ వినియోగదారుల సంక్షేమ సమితి అధ్యక్షుడు పెందోట అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శి సందు ప్రవీణ్ కుమార్ హాజరవుతున్నారు. కేంద్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వినియోగదారుల హక్కుల పరిరక్షణకు సంబంధించి తదుపరి తీర్మానాలు, అమలు నిమిత్తం జరిగే జాతీయ సమావేశాలకు జాతీయ చైర్మన్ డాక్టర్ అనంత్ శర్మ, అధ్యక్షుడు డాక్టర్ అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగే సమావేశాలకు దేశ వ్యాప్తంగా వినియోగదారుల ప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు.

వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలి

- మాజీ సర్పంచ్ కొమ్ముల శ్రీనివాస్



మాట్లాడుతున్న కాంగ్రెస్‌పార్టీ నాయకులు శ్రీనివాస్

నవతెలంగాణ-ముప్కాల్

బీజేపీ నాయకులు మాట్లాడిన మాటల్లో వాస్తవాలు లేవని, మాట్లాడేటప్పుడు వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని ముప్కాల్ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొమ్ముల శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. బీజేపీ నాయకులు నాయకుడు సంతోష్ ఆదివారం రోజు మాట్లాడిన మాటల్లో వాస్తవాలు లేవని ఆరోపించారు. మాట్లాడే ముందు నిజానిజాలు తెలుసుకోవాలని హితువుపలికారు. ముప్కాల్ మండల కేంద్రంలో మణికంఠ ఫంక్షన్ హాల్ నిబంధనలకు విరుద్ధంగా కట్టినట్లు ఆరోపించిన వాటిపై అనుమతి పొందిన ఆధారాలను చూపారు. జిల్లా అధికారులు సైతం మణికంఠ ఏసీ గార్డెన్ నిర్మాణ దశలో ఉన్నప్పుడు పరిశీలించి అనుమతులు ఇవ్వడం జరిగిందన్నారు. ఫంక్షన్ హాల్‌కు చెల్లించవలసిన రుసుమును ఆన్ లైన్ ద్వారా ప్రభుత్వానికి పూర్తి మొత్తంలో చెల్లించడం జరిగిందని అన్నారు. అందుకు సంబంధించిన పత్రలను చూపారు. అదేవిధంగా సర్పంచ్ గా నా పదవీకాలంలో 300 ఇండ్లకుపైగా అనుమతులు ఇచ్చానని పేర్కొన్నారు. గ్రామపంచాయతీ ద్వారా ప్రభుత్వ భూములకు ప్లాట్ నంబర్లు ఇచ్చామని, అందుకు మేం అవినీతికి పాల్పడినట్లు ఆధారాలు ఉంటే చూపాలని అన్నారు. ఇందిరమ్మ కాలనీలో చేసిన పనులు ఒకసారి వెళ్లి చూస్తే బీజేపీ నాయకులకు అర్థం అవుతుందని సూచించారు. రానున్న రోజుల్లో పంచాయతీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో నాపై ఇలాంటి ఆరోపణలు చేసినా.. ఎదుగుదలను అడ్డుకోవాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. మరోమారు నాపై ఆవాస్తవాలను మాట్లాడితే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు ప్రశాంత్ రెడ్డి, పోల ప్రవీణ్, గైని ప్రభాకర్, లాలయ్య, బోట్ల చిన్న రాజన్న, బోట్ల అశోక్, టెంటు శ్రీనివాస్, లోక వెంకట్ రెడ్డి, లోక నరేష్, ముస్కు శీను, ఏలేటి మల్లారెడ్డి, లోక సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రజావాణిలో 10 ఫిర్యాదులు స్వీకరణ

● డీఈ గణేష్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని విద్యుత్ శాఖ సబ్ డివిజనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విద్యుత్ ప్రజావాణి కార్యక్రమంలో మండల పరిధిలోని 10మంది విద్యుత్ వినియోగదారుల నుంచి వివిధ రకాల సమస్యలపై 10 ఫిర్యాదులను అందించినట్టు ఎల్లారెడ్డి విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీర్ (డిఇ) గణేష్ తెలిపారు. వినియోగదారుల నుంచి అందిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి వారి సమస్యలను విద్యుత్‌శాఖ నిబంధనల ప్రకారం తగిన విధంగా త్వరలోనే పరిష్కరిస్తామని ఆయన తెలిపారు.


ఫిర్యాదులు స్వీకరిస్తున్న అధికారులు


మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో బోనాలు

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని బీటి నగర్ మున్నూరు కాపు సంఘం ఐదు తర్పల ఆధ్వర్యంలో ఆయా తర్పల ప్రజలు సోమవారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డప్పు సప్పుళ్లతో బోనాలు ఎత్తు కొని మహిళలు పట్టణంలోని మహాలక్ష్మి ఆలయానికి చేరుకున్నారు. అనంతరం మహాలక్ష్మి మాతకు బోనాలు సమర్పించి వారి మొక్కులను తీర్చుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పుష్కలంగా పండాలని, ప్రజలు సుఖశాంతులతో ఉండాలని వారు కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.


బోనాల ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

త్యాగం, కరుణ, సహనమే బక్రీద్


కామారెడ్డి : షబ్బీర్ అలీకి పుష్పగుచ్ఛం అందజేసి బక్రీద్ శుభాకాంక్షలు చెబుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్


కామారెడ్డి : బక్రీద్ వేడుకల్లో మాట్లాడుతున్న షబ్బీర్ అలీ

● ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ

నవతెలంగాణ-విలేకరుల బృందం

కామారెడ్డి : ప్రజలందరిపై అల్ల దయ ఉండాలని ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ అన్నారు. సోమవారం కామారెడ్డి పట్టణంలోని కోర్ట్ ఆవరణలో గల ఈద్గాలో బక్రీద్ పండుగ సందర్భంగా నమాజ్ చేసిన అనంతరం అందరికీ బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ త్యాగాలకు ప్రతీక బక్రీద్ పండుగ అని వివరించారు. త్యాగాల ద్వారా ప్రాప్తించిన ప్రయోజనాలు సమస్త జనులకు సమానంగా అందినప్పుడే ఆ త్యాగాలకు సార్థకత చేకూరుతుందనే సందేశాన్ని బక్రీద్ పండుగ విశ్వమానవాళికి అందిస్తున్నదన్నారు. బక్రీద్ పండుగ భక్తి, త్యాగం, కరుణ, విశ్వాసం అనే గొప్ప గుణాలను ప్రజల్లో పెంపొందిస్తుందని వివరించారు. సకల మతవిశ్వాసాలను, సంప్రదాయాలను గౌరవిస్తూ రాష్ట్రంలో, దేశంలో పాలన కొనసాగాలని పేర్కొన్నారు. అన్నివర్గాల ప్రజలు శాంతియుతంగా కలిసిమెలిసి జీవించేలా, గంగా జమునా తహజీబ్‌ను కాపాడుకుంటూ అందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని అల్లాతో ప్రార్థించానని పేర్కొన్నారు. తెలంగాణలో ఆధ్యాత్మిక పరంపర కొనసాగాలని అల్లా దయ ప్రజలందరిపై ఉండాలని, ప్రజలంతా సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆకాశిస్తున్నన్నారు.

షబ్బీర్‌అలీని కలిసిన పలువురు..

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని ప్రజలకు కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియా చంద్రశేఖర్‌రెడ్డి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. త్యాగం, కరుణ, సహనాన్ని చాటి చెప్పే భక్తి శ్రద్ధలతో జరుపుకునే పండగ బక్రీద్ పండగ అన్నారు. ఈ పండుగను పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలాదారులు మొహమ్మద్ అలీ షబ్బీర్‌ను కామారెడ్డిలోని ఆయన నివాసంలో కలిసి బోకే అందించి బక్రీద్ పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. చైర్ పర్సన్‌తో పాటు కామారెడ్డి పట్టణ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీని బక్రీద్ పండగ సందర్భంగా కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఆయన స్వగృహంలో మండల రైతుబంధు సమితి మాజీ అధ్యక్షులు అంకన్నగారి నాగరాజ్ గౌడ్ కలిసి పుష్పగుచ్ఛం అందించి బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయనతో పాటు శుభాకాంక్షలు తెలిపిన వారిలో మాజీ ఎంపీటీసీలు చంద్రాగౌడ్, చందుపట్ల విఠల్, మాజీ ఉపసర్పంచ్ ఉప్పుల సాయినాథ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బాశెట్టి నాగేశ్వర్, అరుణ్, నరేందర్ తదితరులున్నారు.


శుభాకాంక్షలు వీవోఏ అధ్యక్షుడు..

సదాశివనగర్ : ఐకెపి వీవోఏ ఉద్యోగుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పఠాన్ గౌస్ ఖాన్, కామారెడ్డి జిల్లా అధ్యక్షులు మాలోత్ శివారం నాయక్, జిల్లా కార్యదర్శులు మల్లుపేట మంచాల నరేష్ యాదవ్, అన్నారం డాక్టర్ రమేష్ బక్రీద్ పండగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహ్మద్ షబ్బీర్ అలీని కామారెడ్డిలో స్వగృహంలో కలిసి బక్రీద్ పండగ శుభాకాంక్షలు తెలిపారు.

మహ్మద్ షబ్బీర్ అలీకి సన్మానం..

దోమకొండ : రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహ్మద్ షబ్బీర్ అలీని కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో బక్రీద్ పండగ సందర్భంగా దోమకొండ కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు అనంతరెడ్డి, జడ్పీటీసీ తీర్మాల్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రావులపల్లి నర్సరెడ్డి, సిద్దరెడ్డి, తిరుపతిరెడ్డి, రాజేందర్, మధు, నాగేంద్ర వర్మ మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.


సదాశివనగర్ : షబ్బీర్ అలీకి సన్మానం


దోమకొండ : షబ్బీర్‌అలీకి పుష్పగుచ్ఛం అందజేత

ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

● విజ్ఞాన్ వికలాంగుల సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు

నవతెలంగాణ-కామారెడ్డి



కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పెన్షన్ పెంచుతామని హామీనిచ్చిందని, అధికారంలోకి వచ్చి నేటికి 6 నెలల 11 రోజులు గడుస్తున్నాయని, అయినా పెన్షన్ పెంపుపై ఇప్పటికీ జీవో ఇవ్వకపోవడంలో ఆంతర్యమేమిటని విజ్ఞాన్ వికలాంగుల సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు చిప్ప దుర్గాప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. మొన్నటి మొన్న తెలుగు రాష్ట్రమైన అక్కడ అధికారం చేపట్టిన తెలుగుదేశం పార్టీ ఇచ్చిన మాట కోసం జీవో జారీ చేయడం అభినందనీయమని తెలిపారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో దివ్యాంగుల సంక్షేమం కోసం ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేదా మారో ఉద్యమానికి దివ్యాంగులందరు సిద్ధం కావాలని ఈ సందర్భంగా కోరారు.

పార్లమెంట్ ఎన్నికల్లో కృషిచేసిన వారికి సన్మానం



సన్మానం పొందిన బీజేపీ నాయకులు

నవతెలంగాణ-సదాశివనగర్

సదాశివనగర్ బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ బలోపేతానికి కృషిచేసి సదాశివనగర్ మండలంలోని పలువురిని సోమవారం ఘనంగా సన్మానించారు. బీజేపీ మండలాధ్యక్షులు కుంట రాంరెడ్డి ఆధ్వర్యంలో శాలువాలతో సన్మానించి స్వీట్లు పంచారు. సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శులు అమృత భూంరావు, మార రమేష్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షులు స్వరన్‌రెడ్డి, ప్రవీణ్, మోహన్‌రాజ్, ఓబీసీ అధ్యక్షులు కటికే రమేష్, ఎస్టీ మోర్చా అధ్యక్షులు చందర్ నాయక్, శక్తి కేంద్రం ఇన్చార్జులు ఏనుగు జైపాల్‌రెడ్డి, సృజన్‌రెడ్డి, వడ్ల శ్రీనివాస్, వెంకటేష్ గుప్తా, అన్ని గ్రామాల బూత్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత పరిష్కారం చూపండి


తన ఇంటి వద్ద బాధితురాలు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని మైనార్టీ రెసిడెన్షియల్ కళాశాల ఆవరణలో గత 25 సంవత్సరాలుగా నివాసముంటున్న షహీన్.. అక్కడి నుంచి ఇంటిని తొలగించాలని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పలుమార్లు కళాశాలను సందర్శించిన సమయంలో తెలిపారు. గత 25 సంవత్సరాల కిందట పవర్ ప్లాంట్‌కు ఎదురుగా చిన్న గుడిసె వేసుకొని హోటల్ నడిపిస్తుండగా.. రెంజల్ గ్రామపంచాయతీ అధికారులు ఆమె వద్ద గత 25 సంవత్సరాలుగా టాక్స్ వసూలు చేశారు. ప్రస్తుతం అక్కడ మైనార్టీ రెసిడెన్షియల్ కళాశాలను ఏర్పాటు చేయడంతో ఈ నిరుపేదరాలికి సొంత ఇల్లు లేక అక్కడే నివాసం ఉంటున్నారు. పలుమార్లు ఈ కళాశాలను సందర్శించిన అధికారులు, ప్రజా ప్రతినిధులు స్థానిక నాయకులు ఆమెకు శాశ్వత పరిష్కారం చూపాలని ఇంటి స్థలం, నిర్మాణం కోసం చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చిన ఎవరూ పట్టించుకోకపోవడంతో ఆమె మనస్థాపానికి గురవుతోంది. ప్రభుత్వ భూమి కావడంతో పంచాయతీ అధికారులు పన్నులను వసూలు చేస్తుండడంతో ఆమెను అక్కడ నుంచి తొలగించడానికి ఎవరికి ఆస్కారం లేకుండా పోయింది. మండలంలో ఎక్కడైనా తనకు తలదాచుకోవడానికి ముందుకు రావాలని ఆమె కోరుతోంది. గత పది సంవత్సరాల కిందట భర్త మృతి చెందడంతో తన పిల్లలతో ఆమె అక్కడే ఉంటూ కూలి పని చేసుకుంటూ పిల్లలను పోషించుకుంటుంది. స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆమెకు శాశ్వత పరిష్కారం చేయాలని ఆమె ఎదురుచూస్తోంది.

ప్రమాదకర మూలమలుపు

● సైడ్‌వాల్ ఏర్పాటు చేయాలని కోరుతున్న గ్రామస్తులు

నవతెలంగాణ-ఎడపల్లి


ప్రమాదకరంగా మారిన మూలమలుపు

మండలంలోని మంగళ్‌పహాడ్ నడిబొడ్డున గ్రామంలోని దొడ్డి మూలమలుపు వద్ద ఇరువైపులా సైడ్ వాళ్ల లేకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. ప్రధానంగా గ్రామంలో ఐదు మూలమలుపులున్నాయి. అయితే దొడ్డి వద్ద గల మూలమలుపు వద్ద ఇరువైపులా సైడ్ వాళ్ల లేకపోవడంతో నిత్యం రాకపోకలు సాగించే స్థానికులతో పాటు, ద్విచక్ర వాహనదారులకు, గ్రామంలోకి వచ్చే ప్రైవేట్ వాహనాలకు, వడ్ల సీజన్‌లో చిరు వ్యాపారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు మూలమలుపు వద్ద అతివేగంగా మోటార్ సైకిల్ నడపడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. గ్రామంలో ట్రాక్టర్లు సైతం అధికంగా ఉన్నాయి. వాహనాలన్నీ ఇదే ప్రధాన రహదారి వెంట రాకపోకలు సాగిస్తాయి. మూలమలుపు వద్ద వాహనదారులు నెమ్మదిగా వెళ్లి ప్రమాదాలు జరగకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోటరీ క్లబ్ ఉత్తమ అధ్యక్షుడిగా పోలబోయిన సత్యం



పురస్కారాన్ని అందుకుంటున్న పోలబోయిన సత్యం

నవతెలంగాణ-కామారెడ్డి

రాష్ట్రవ్యాప్తంగా రోటరీ క్లబ్ సేవలను పురస్కరించుకొని 16-6-24న భద్రాచలంలో నిర్వహించిన కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అందించిన సేవలకు పట్టాభిషేకం పురస్కారాలలో కామారెడ్డి క్లబ్, అధ్యక్షులు పోలబోయిన సత్యంను, ఆయన చేసిన సేవలకు గాను తెలంగాణ రాష్ట్రవ్యాప్త మీడియం క్లబ్‌లకు ఉత్తమ అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. రాష్ట్ర రోటరీ గవర్నర్ 3150, బుసిరెడ్డి శంకర్ రెడ్డి చేతులమీదుగా అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు పొలబోయిన సత్యం మాట్లాడుతూ.. కామారెడ్డి క్లబ్‌కు జులై 2023న పదవీ బాధ్యతలు చేపట్టి, ఈ 12 నెలల కాలంలో సుమారు 60 పైచిలుకు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించినట్టు తెలిపారు. తాము చేసిన సేవలను గుర్తించిన రాష్ట్ర బాధ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. సేవా కార్యక్రమాలు నిర్వహించడానికి సహకరించిన ప్రతి రోటరీ సభ్యునికి, దాతలకు ధన్యవాదాలు తెలుపుతూ, భవిష్యత్తులో తన వంతు కృషి సహాయ సహకారాలు ఎల్లప్పుడూ క్లబ్ కార్యక్రమాల్లో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి పెనుబెల్లి రాజనర్సింహారెడ్డి, కోశాధికారి తోరణాల సుధాకర్, సీనియర్ సభ్యులు డాక్టర్ బాలరాజు, అయిత బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

ఏజెంట్ మోసంతో వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-రామారెడ్డి

గల్ఫ్ ఏజెంట్ మోసంతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన సుద్దాల చిన్న రాజయ్య (51) బతుకుదెరువు కోసం గల్ఫ్‌దేశానికి వెళ్లడానికి పోసానిపేట గ్రామానికి చెందిన పళ్లెం భరతుని సంప్రదించి ఆయనకు రూ.లక్ష 50 వేలు చెల్లించాడు. నెలలు గడుస్తున్నా గల్ఫ్ దేశానికి పంపకపోవడం, అప్పులు పెరిగిపోయాయి. అప్పుల ఇచ్చిన వారు ఇంటికి రావడం.. ఏజెంట్ మోసం చేయడంతో మనస్థాపానికి గురైన రాజయ్య తన వ్యవసాయ పొలంలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య దేవవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ విజయ్ కొండ తెలిపారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలి

● ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

● ప్రభుత్వ ఆసుపత్రి తనిఖీ

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు వైద్య సిబ్బందికి సూచించారు. ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సోమవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని ఓపి రిజిస్టర్‌ను పరిశీలించి రోగులతో ముచ్చటించారు. రోగులకు ఆసుపత్రిలో సౌకర్యాలు, ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఎలాంటి అవినీతి జరిగినా సహించేది లేదని, అవినీతికి పాల్పడిన ఎవ్వరినీ ఉపేక్షించేది లేదని, తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నియోజకవర్గంలో రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణం కోసం రూ.36 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. ఈ నిధులతో మారుమూల గ్రామాలకు సైతం రవాణా సౌకర్యాలను మెరుగుపరుస్తామన్నారు. త్వరలోనే వివిధ శాఖల అధికారులతో కోఆర్డినేషన్ రివ్యూ మీటింగ్ నిర్వహించి సమగ్ర సమాచారం సేకరించి అభివృద్ధి దిశగా ముందుకు సాగుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌ను జయప్రదం చేయండి

నవతెలంగాణ-బోధన్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందులో జూన్ 23న జరిగే ఐ.ఎఫ్.టీ.యూ రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌ను జయప్రదం చేయాలని ఐ.ఎఫ్.టీ.యూ. జిల్లా అధ్యక్షుడు పుట్ట వరదయ్య కార్మికులకు పిలుపునిచ్చారు. జనరల్ కౌన్సిల్‌కు సంబంధించిన గోడ ప్రతులను సోమవారం బోధన్ ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని విమర్శించారు. పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను రద్దు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 44 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికులకు తీరని అన్యాయం చేశారని ఆరోపించారు. కార్పోరేటికరణ, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు పోరాడాలని పిలుపునిచ్చారు. మున్సిపాలిటీ, టైల్స్, బీడీ, మోటార్, హమాలీ, భవన నిర్మాణ కార్మికుల హక్కుల సాధనకై పోరాడాలని అన్నారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలైన సింగరేణి, ఆర్‌టిసి, జెన్‌కో, రైల్వే విద్యుత్ శాఖ, బ్యాంకింగ్, విమానయానం, రక్షణ విభాగం, ఎల్ఐసి, వంటి తదితర ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అప్పనంగా మోడీ ప్రభుత్వం అప్పచెబుతున్నదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి టి.సాయిలు, బోధన్ ఏరియా కార్యదర్శి సురేష్, గీత కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ పి.గంగాధర్‌గౌడ్, నాయకులు లక్ష్మణ్‌గౌడ్, సాయాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



గోడప్రతులను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎడపల్లిలో కుక్కల బెడద

● భయభ్రాంతులకు గురవుతున్న ప్రజలు

నవతెలంగాణ-ఎడపల్లి



మండల కేంద్రంలోని మూడో వార్డులో కుక్కల బెడద తీవ్రమైంది. విచ్చలవిడిగా కుక్కలు సంచరించడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇదే కాలనీలో పోచమ్మ గుడి, హనుమాన్ ఆలయం ఉంది. ఆలయానికి వచ్చేవారు భయభ్రాంతులకు గురవుతున్నారు. కాలనీలో ఒకే కుక్క సుమారు 70 మందికిపైగా దాడి చేసి కరిచిందని స్థానికులు చెబుతున్నారు. సోమవారం మధ్యాహ్నం గ్రామానికి చెందిన ఓ మహిళ తమ పొలంలో వ్యవసాయ పనులు ముగించుకొని ఇదే కాలనీ ద్వారా తమ ఇంటికి వెళ్తుండగా కుక్క మహిళపై దాడిచేసింది. వెంటనే మహిళను తమ కుటుంబ సభ్యులు ఎడపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎడపల్లి మండల కేంద్రంలో కుక్కల బెడదను నివారించాలని గ్రామస్తులు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
మంగళవారం | జూన్ 18, 2024 | www.navatelangana.com

జావిద్ పటేల్‌కు శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

నవతెలంగాణ-మద్నూర్

త్యాగానికి సత్యానికి ప్రతీక బక్రీద్ పర్వదినమని మొహమ్మద్ ప్రవక్త బోధించిన సమైక్యతను సహోదర భావాన్ని అందరూ అనుసరించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దరాస్ వార్ సాయిలు పేర్కొన్నారు. సోమవారం బక్రీద్ పండుగ సందర్భంగా మైనార్టీ మండల నాయకులు జావిద్ పటేల్ ఆహ్వానం మేరకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఆయన ఇంటికి వెళ్లి అతనికి అతని కుటుంబ సభ్యులకు బక్రీద్ పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. పండుగ సందర్భంగా జావిద్ పటేల్ అందరికీ సురుకుంభ స్వీట్‌లను తినిపించారు. కార్యక్రమంలో మద్నూర్ మున్నూరు కాపు సంఘం ఉపాధ్యక్షులు కర్ల సాయిలు, ప్రధాన కార్యదర్శి సందూరువార్ హనుమాన్లు, మాజీ ఉపసర్పంచ్ అవర్‌వార్ హనుమాన్లు, మాజీ వార్డు సభ్యులు జ్ఞానేశ్వర్, సాయిని, భారత్ గంగాధర్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

చేపలు పట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తు మృతి

నవతెలంగాణ-నిజాంసాగర్



మండల కేంద్రంలోని నిజాంసాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్ లో చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో పడి ఒకరు మృతి చెందారు. ఎస్ఐ సుధాకం వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డి మండలం తిమ్మారెడ్డి తాండకు చెందిన కేతావత్ జైపాల్ (35) సోమవారం నిజంసాగర్ ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ లో దిగి చేపలు పట్టేటప్పుడు ప్రమాదవశాత్తు డ్యాం నీటిలో పడి మృతిచెందడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్క్మి తెలిపారు.

స్థానిక పోరుపై ఎదురుచూపులు..!

- రిజర్వేషన్లపై స్పష్టతనివ్వని ప్రభుత్వం
- ఆశావాహుల్లో ఉత్కంఠ



నవతెలంగాణ - నిజామాబాద్

గడువు తీరిన గ్రామ పంచాయతీ పాలకవర్గం ఎన్నికకు ఇప్పట్లో ముహూర్తం కుదిరేలాలేదు. ఈ జూన్‌లో పంచాయతీ ఎన్నికలు ఉంటాయని అప్పట్లో సీఎం రేవంత్‌రెడ్డి గతంలో ప్రకటించిన ఆ దిశగా గ్రామ పంచాయతీ ఎన్నికలకు అడుగులు పడడంలేదు. గత ఫిబ్రవరి ఒకటిన పంచాయతీ పాలకవర్గం పదవికాలం ముగిసింది. ఆ సమయంలో ఈసీ ఆదేశాల మేరకు జిల్లా అధికారులు ఎన్నికల సామగ్రిని సిద్ధం చేశారు. ఆ తర్వాత లోక్‌సభ ఎన్నికలు రావడంతో పంచాయతీ ఎన్నికలు జూన్‌లో నిర్వహిస్తారని అంతా భావించారు. కానీ బీసీ రిజర్వేషన్‌ల విషయంలో తేలకపోవడంతో కులగణ డిమాండ్ నేపథ్యంలో పంచాయతీ ఎన్నికలకు మరింత సమయం పట్టే అవకాశం ఉన్నట్టు తెలుస్తుంది. దీంతో పంచాయతీల్లో ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్‌లు కొనసాగిస్తారా, మారుస్తారా అనే చర్చలు గ్రామ పంచాయతీల అంతటా జరుగుతున్నట్టు తెలుస్తుంది.

2019 ఎన్నికలు ఇలా...

అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం పంచాయతీరాజ్ చట్టం 2018 అమల్లోకి తీసుకొచ్చి 2019లో సర్పంచ్ ఎన్నికలకు నిర్వహించింది. జనవరి ఒకటిన ఎన్నికల షెడ్యూల్ నోటిఫికేషన్ వెలువడింది. జనవరి 21, 25, 35వ తేదీల్లో మూడు దశల్లో పార్టీ రహితంగా ఎన్నికలు నిర్వహించారు. ఫిబ్రవరి ఒకటిన సర్పంచ్‌లు, వార్డుసభ్యులు బాధ్యతలు స్వీకరించారు. 2024 ఫిబ్రవరి ఒకటితో సర్పంచ్‌ల పదవికాలం ముగియడంతో జిల్లాలోని 335 పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన బాధ్యతలు చేపట్టారు. 2019 ఆగస్టులో రాష్ట్రంలో తొలిసారిగా గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన రాగా తాజాగా మరోసారి గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన రావడం ఇది రెండోసారి.

రిజర్వేషన్ అడ్డంకిగా...

గ్రామ పంచాయతీ ఎన్నికలకు రిజర్వేషన్‌లు ప్రధానంగా అడ్డంకిగా మారాయి. గత ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన పంచాయతీ రాజ్ చట్టం 2018 ఎన్నికల స్థానాలకు రిజర్వేషన్‌లు ఐదేండ్ల పాటు వర్తిస్తాయని పేర్కొంది. తాజాగా తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో పాత రిజర్వేషన్ ప్రకారమే ఎన్నికలు నిర్వహిస్తుందా.. ? లేక ఏదైనా మార్పులు చేస్తుందా.. ? అనే ఆసక్తి తర్వాత నెలకొంది. ఒకవేళ చట్టాల్లో మార్పు చేస్తే జనాభా ప్రతిపాదన ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్, సామాజిక వర్గాలకు రిజర్వేషన్‌లు కేటాయించే అవకాశం ఉంటుంది. ఇందుకోసం ప్రస్తుత చట్టంలో మార్పులు చేయాలి. అదీ జరుగకుంటే మరో కొత్త చట్టాన్ని అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదం పొందాలి. ఈ మొత్తం ప్రక్రియ జరగాలంటే చాలా సమయం పడుతుంది. మరో వైపు బీసీ గణన తదితర కార్యక్రమాలతో స్థానిక సంగ్రామం ఆలస్యం కావచ్చునేమోనని చర్చలు అన్ని రాజకీయ వర్గాల్లో కొనసాగుతుంది. ఎన్నికలు మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉండడంతో ముందుకెళ్లాల, రిజర్వేషన్ మారితే ఖరారైన తర్వాత అడుగు ముందుకు వేయాలా అనే సందిగ్ధంలో ఉన్నారు. ఒకవేళ రిజర్వేషన్ మారితే పెట్టిన ఖర్చు వృథా అవుతుందేమోనని ఆశాభావులు ఆలోచిస్తున్నారు. చాలామంది ఆయా గ్రామ పంచాయతీల్లో రిజర్వేషన్‌లు వస్తే కొత్త వారు బరిలోకి దిగడానికి ఎదురుచూస్తున్నారు. యువకులు కూడా సర్పంచ్ కావాలని ముందుకు వస్తున్నట్టు ఆయా గ్రామ పంచాయతీల్లో చర్చలు జరుగుతున్నాయి. ఏదెలా ఉన్నా ఎన్నికలు జరగాలని అందరు ఎదురుచూస్తున్నారు. ఆయా గ్రామ పంచాయతీల్లో టెన్షన్ టెన్షన్‌గా ఉన్నట్టు తెలుస్తుంది. ప్రస్తుతం రాష్ట్రంలో అప్పట్లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు గ్రామ పంచాయతీల్లో బీఆర్ఎస్ సర్పంచ్‌లుగా చాలామంది గెలిచారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో మళ్లీ రిజర్వేషన్ల మార్పుపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. కొత్త ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని సర్వత్రా ఆసక్తి నెలకొంది.

ప్రభుత్వ సలహాదారుడికి బక్రీద్ శుభాకాంక్షలు వెల్లువ



షబ్బీర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-భిక్కనూర్

ప్రభుత్వ సలహాదారుడు మహమ్మద్ షబ్బీర్ అలీ కి బక్రీద్ పండుగ సందర్భంగా మండల కాంగ్రెస్ నాయకులు కామారెడ్డి పట్టణంలోని షబ్బీర్ అలీ నివాసంలో సోమవారం శుభాకాంక్షలు తెలియజేశారు. శుభాకాంక్షలు తెలియజేసిన వారు టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు చంద్రకాంత్ రెడ్డి, మండల అధ్యక్షుడు భీమ్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుదర్శన్, పట్టణ అధ్యక్షులు దయాకర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు శుభాకాంక్షలు తెలియజేశారు.



ఆర్మూర్‌లో..



బాల్కొండ : బక్రీద్ ప్రత్యేకతను వివరిస్తున్న గురువు

ఘనంగా ఈద్ -ఉల్ -అదా



పండుగ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న చిన్నారులు

- జిల్లా వ్యాప్తంగా బక్రీద్ వేడుకలు
- ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు
- శుభాకాంక్షలు తెలిపిన పలువురు నాయకులు

బక్రీద్ పండుగను ముస్లిం సోదరులు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయం ఈ ద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మౌల్వీలు బక్రీద్ పండుగ విశిష్టతను వివరించారు. అనంతరం ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

నవతెలంగాణ-విలేకరులు

డిచ్‌పల్లి: ఈద్ -ఉల్ -అజ్హా బక్రీద్ పండుగ అంటే ఇబ్రహీం ప్రవక్త నిజాయితీకి, త్యాగానికి నిదర్శనమని మౌలానా మొహసిన్ రజా, ఇతర హాఫిజ్ ఏ ఖుర్‌ఆన్ మౌల్వీలు పేర్కొన్నారు. డిచ్ పల్లి, ఇందల్ వాయి మండల కేంద్రలతోపాటు గ్రామాల్లో ఈద్ -ఉల్ -అజ్హా బక్రీద్ పండుగ సంబరాలు ఘనంగా నిర్వహించారు. గ్రామ పోలిమేర్లలో ఉన్న ఈద్గాల వద్ద సోమవారం ప్రత్యేక ప్రార్థనలు చేసి ఒకరికి ఒకరు ఈద్ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. డిచ్‌పల్లి, ఇందల్ వాయి మండల కేంద్రలలోని ఈద్గాలో (హాఫిజ్ ఏ ఖుర్‌ఆన్) మౌల్వీలు బక్రీద్ పండుగ విశిష్టతను, కుర్బానీ యొక్క ప్రాముఖ్యతను,క్లుప్తంగా వివరించారు. అనంతరం ముస్లిం సోదరులు సామూహిక ప్రార్థనలు చేసి బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అల్లా చూపిన సన్మార్గంలోనే పయనించాలని సూచించారు. పండగ సందర్భంగా ఈద్గాలవద్ద కమిటీలు, గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. అనంతరం తమ పూర్వీకుల సమాధుల వద్ద కు వెళ్ళి ప్రార్థనలు చేశారు.ఈ కార్యక్రమంలో ఖిల్లా డిచ్పల్లి, పోలీస్ క్యాంప్, ఇస్లాంపుర, ఘనపూర్,తిర్మన్ పల్లి, ఇందల్ వాయి, సిర్నపల్లి, నల్లవెల్లి యెల్ల రెడ్డి పల్లి, అమ్రన్ పల్లి తోపాటు ఆయా గ్రామాల మస్ జిద్ కమిటీ సభ్యులు అహ్మద్ ఖురేషి, షేక్ ఖాజా మియ్య కో ఆప్షన్ సభ్యులు షేక్ హుస్సేన్, షేక్ నయీమ్,అన్వర్ ఖురేషి,హబీబ్, తజోద్దిన్,సద్దం, అబ్దుల్ గఫర్, గఫర్ ఖురేషి, సైయ్యద్ నయీమ్, మహబూబ్ పటేల్, అమేర్, ఎజాజ్, తదితరులు పాల్గొన్నారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా ఎస్సై లు మహేష్, మనోజ్ కుమార్ పోలిసులు కృషి చేశారు.

జక్రాన్‌పల్లి : మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో ఈద్గావద్ద వద్ద మైనార్టీ సోదరులు ప్రార్థనలు చేశారు. ప్రార్థనల్లో మండల కో ఆప్షన్ బుల్లెట్ అక్బర్ ఖాన్ షేక్ నజీర్ మొహమ్మద్ అక్రమ ఖన్ షేక్ ఖలీమ్ మహమ్మద్ సమీర్ ఖాన్ మొల్ సబ్బులు తదితరులు పాల్గొన్నారు.

ఏర్గట్ల: త్యాగానికి ప్రతీకైన బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లింలు ఈద్గా వద్ద సామూహిక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ పండగ అత్యంత ప్రీతి పాత్రమైనదని అన్నారు.కార్యక్రమంలో ముస్లీం సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఆర్మూర్: ఈ ద్గాలవద్ద ప్రార్థనల అనంతరం మర్కజ్ కమిటీ అధ్యక్షులు మే హినుద్దీన్ మాట్లాడుతూ ధనిక, పేద అనే భేద భావాలు లేకుండా జరుపుకునే పండగ అని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా జరుపుకునే ఈ పండగ త్యాగనిరతికి అద్దం పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ భర్త అయ్యప్ప శ్రీనివాస్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు సాయి బాబా గౌడ్, బిసి సెల్ పట్టణ అధ్యక్షులు రమణ దొండి, మార్కాజ్ కమిటీ ఉపాధ్యక్షులు యండి అబ్దుల్ ముక్తార ను, జాయింట్ సెక్రెటరీ మమ్మద్ రిజ్వా ను ,ట్రెజరర్ సాజిద్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

బాల్కొండ : మండలంలో బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ముస్లింలు జరుపుకునే పవిత్రమైన పండుగలలో బక్రీద్ పండుగ ఒకటి. ఈ బక్రీద్ పండుగను ముస్లింలు ఈద్గాల వద్ద, మసీదుల వద్ద భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేసి అందరూ బాగుండాలని అల్లాతో దువా చేశారు. ఒకరినొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. భక్తిని, త్యాగ గుణాన్ని ఈ బక్రీద్ పండుగ చాటి చెబుతుందని, తమకు కలిగిన దాంట్లో నుంచే ఇతరులకు పంచిపెట్టడాన్నిమించిన నిజమైన దాతృత్వం మరొకటి లేదని "బక్రీద్ " పండుగ తెలియజేస్తుందని వారు తెలిపారు. ప్రార్థన స్థలాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బాల్కొండ ఎస్సై కే గోపి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

నిజామాబాద్ సిటీ: తెలుగుదేశం పార్టీ నిజామాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు దేగాం యాదాగౌడ్ బక్రీద్ పండుగ సందర్భంగా మైనారిటీ నాయకులు షేక్ అహ్మద్, మైనారిటీ నాయకులకు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఇంచార్ వినోద్ కుమార్, కల్లెడ గంగాధర్, శంకర్ ముదిరాజ్, లవంగ రాజు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ధర్పలి: మండలంలోని ముస్లిం సోదరులు ఉదయం ఈద్గాలవద్ద ప్రత్యేక నమాజ్ చేశారు. అనంతరం ఒకరినొకరు అలాయ్ బాలయ్ చేసుకున్నారు. వర్షాకాలం కావడంతో నమాజ్ సమయంలో వర్షం కురుస్తుందో అని ముందుగానే ఆయా కమిటీల సభ్యులు ఇబ్బందులు కల్గకుండా ప్రతేక ఏర్పాట్లు చేశారు. వర్షం లేకపోవడంతో ఈద్గల్లోనే నమాజ్ ఆచరించడంపూర్తి కావడంతో మైనారిటీ సోదరులు హర్షం వ్యక్తం చేశారు.



డిచ్‌పల్లిలో..



ధర్పల్లిలో..




ఏర్గట్లలో..



జక్రాన్‌పల్లిలో..

అల్ల నేరేడు పండ్లు సర్వరోగ నివారిణి



నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

నేరేడు పండు సర్వరోగ నివారిణి అని మన పెద్దలు చెప్తూ ఉంటారు. కనీసం సంవత్సరంలో ఒక సారైనా నేరేడు పండ్లు తినమని చెప్తారు .కారణం నేరేడు పండు సర్వ రోగ నివారిణి. శరీరంలోని రక్తాన్ని శుద్ధి చేస్తుంది. కడుపులో ప్రేగులకు చుట్టుకుని ఉన్న వెంట్రుకలని కూడా బయటకు నెట్టేస్తుందని చెబుతున్నారు. ఇప్పుడిప్పుడే మార్కెట్లో కి వస్తున్నాయి. మీకు బజార్లో కనిపిస్తే తప్పకుండా తినండి. తినే ముందు నీళ్ళలో ఉప్పువేసి పళ్ళను బాగా కడుక్కుని తినండి. నాటు నేరేడు పళ్ళే తినండి. నాటు పళ్ళు దొరకని పక్షంలో హైబ్రిడ్ పళ్ళు అయినా తినవచ్చు.

నేరేడు పండ్లు తినడం వలన లాభాలు.

కాలేయ పనితీరును మెరుగుపరుస్తుంది. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. డయేరియా మరియు అల్సర్ నివారిస్తుంది. గౌట్ బాధను నివారిస్తుంది. హిమోగ్లోబిన్‌ను పెంచుతుంది. ఎముకలను బలంగా ఉంచుతుంది. కళ్ళు మరియు చర్మానికి మంచిది. రోగనిరోధక శక్తిని పెంచుతుంది. డీ హైడ్రేషన్ నుండి కాపాడుతుందని డాక్టర్లు కూడా చెప్తున్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలను ప్రభుత్వ బడిలో చదివించాలి

- ఏఐఎస్‌బీ జిల్లా అధ్యక్షులు బైరాపూర్ రవీందర్ గౌడ్

నవతెలంగాణ-ఎడపల్లి

ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలను ప్రభుత్వ బడిలో చదివించాలని ఏఐఎస్‌బీ జిల్లా అధ్యక్షులు బైరాపూర్ రవీందర్ గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో అన్ని వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను ప్రాథమిక హక్కుగా అందించాలని కోరారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలనూ ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని, ఈ విషయంపై జిల్లా కలెక్టర్ చొరవ చూపించాలని తెలిపారు. మార్పు మన జిల్లా నుంచే మొదలు కావాలని పేర్కొన్నారు. మెరుగైన విద్య నిరుపేదలకు అందాలంటే కింది స్థాయి నాయకుల నుంచి పెద్దస్థాయి నాయకులు, ప్రభుత్వ ఉద్యోగుల వరకు ప్రతి ఒక్కరూ తమ విధిగా భావించి వారి పిల్లల్ని ప్రభుత్వ బడులోనే చేర్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

డిడిఎన్ పూజారుల ఉమ్మడి జిల్లా సమావేశం

- పలు తీర్మానాలు

నవతెలంగాణ-కామారెడ్డి

నిజామాబాద్ ఉమ్మడి జిల్లా దూపదీప నైవేద్య అర్చక సంఘం ఆధ్వర్యంలో ఆయా మండల అధ్యక్ష కార్యదర్శులు కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశాన్ని కామారెడ్డి జిల్లాలో గల శ్రీ రామకృష్ణ వైదికథ పీఠం వేద పాఠశాలలో పలు తీర్మానాలు చేస్తూ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఉమ్మడి జిల్లాలకు సంబంధించిన కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. పలు విషయాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షులు రాజప్ప, కామారెడ్డి జిల్లా అధ్యక్షులు అంజనప్ప, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమేష్ మారాజు, శీలవంచ కృష్ణమాచార్యులుతో పాటు ఉమ్మడి జిల్లా, మండల కార్యవర్గ సభ్యులు 90 మంది అర్చకులు తదితరులు పాల్గొన్నారు.



రెంజల్ : ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



లింగంపేట్ : ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ఘనంగా బక్రీద్

ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు.. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్న ముస్లింలు

త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పండుగను ముస్లింలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయమే నూతన వస్త్రాలు ధరించి ఈద్గాలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతూ ఆలింగనం చేసుకున్నారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం ముస్లింలు వారి తల్లిదండ్రుల సమాధులపై పూలు చల్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



లింగంపేట్ : సమాధి వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న మహమ్మద్ మోయినమ్మద్ ఖాదిరి



బోధన్‌లో..



బోధన్‌లో ముస్లింల ప్రార్థనలు



నాగిరెడ్డిపేట్ : ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకొంటున్న ముస్లింలు

నవతెలంగాణ-విలేకరుల బృందం

లింగంపేట్ : త్యాగానికి, సత్యానికి ప్రతిరూపమే బక్రీద్ పండుగని ముస్లింలు అన్నారు. మండల కేంద్రంలో మైనార్టీ సోదరులు బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ముస్లింలు కొత్తబట్టలు ధరించి లింగంపేట సమీపంలోని పెద్దవాగు వద్దకు డప్పుసప్పులతో నమాజ్ గడ్డపై పెద్ద ఎత్తున ముస్లిం సోదరులు చిన్నారులు చేరుకున్నారు. మదర్సా నిర్వాహకుల అబుల్ హసన్ రిజ్వి మాట్లాడుతూ.. మహమ్మద్ ప్రవక్త చేసిన త్యాగాలను సత్యాలను వివరించారు. ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు ప్రత్యేక నమాజ్ చేశారు. అనంతరం ఒకరినొకరు అలింగనం చేసుకొని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. వారి తల్లిదండ్రుల సమాధుల వద్దకు వెళ్లి పూలు చల్లి నివాళులర్పించారు. తల్లిదండ్రుల సేవలను గుర్తుకుతెచ్చుకున్నారు. రాష్ట్ర హైకోర్టు సీనియర్ న్యాయవాది, రాష్ట్ర జలమండలి సభ్యులు మమ్మద్ మోయినమ్మద్ ఖాదిరి వారి తల్లిదండ్రుల సమాధి వద్దకు వెళ్లి పూలు వేసి ప్రత్యేక నమాజ్ చేశారు. బక్రీద్ పండుగ సందర్భంగా పేదలకు కుర్బానీ పంపిణీ చేశారు.



బోధన్ : త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పండుగను సోమవారం ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఉదయమే నూతన వస్త్రాలు ధరించి ఈద్గాలకు వెళ్లి ప్రత్యేక నమాజ్ చేశారు. అనంతరం ఒకరికొకరు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతూ ఆలింగమం చేసుకున్నారు. ముస్లింల ప్రధాన పండుగలైన రంజాన్, బక్రీద్. ఇస్లామ్ క్యాలెండర్ ప్రకారం 12వ నెల జిలేజ్ 10వ తేదీన బక్రీద్ పండుగను ముస్లింలు ఘనంగా జరుపుకుంటారు. ఇస్లాం మతంలోని ఐదు ప్రధాన సూత్రాలలో ఒకటైన హజ్ తీర్థయాత్రను ముస్లింలు వెళ్తారు. హజ్ యాత్రకొరకు అరబ్ దేశమైన సౌదీ అరేబియాలోని మక్కా నగరానికి చేరుకుని మసీద్‌లో ఉన్న కాబా చుట్టూ ఏడు ప్రదక్షిణలు చేసి అక్కడ ప్రార్థనలు చేస్తారు. ఈ మసీద్ కాబా గృహం చుట్టూ ఉంది. ప్రపంచంలోని ముస్లింలందరూ కాబా వైపు తిరిగి నమాజ్ (ప్రార్థనలు) చేస్తారు. హజ్ తీర్థయాత్రకు వెళ్ళినవారు మక్కా నుండి మదీనా (ముహమ్మద్ ప్రవక్త గోరీ ఉన్ననగరం)ను సందర్శిస్తారు. అల్లాహ్ ఆదేశానుసారం ఇబ్రహీం తన ఏకైక పుత్రుడైన ఇస్మాయిల్‌ని బలి ఇవ్వడానికి సిద్ధమౌతాడు. ఆ సంప్రదాయాన్ని స్మరిస్తూ ముస్లింలు ఈ బక్రీద్‌ను జరుపుకుంటారు. కార్యక్రమంలో బాబుఖాన్, మమ్మద్‌ఖాన్, ముఖీం, ఇలియాస్, పాషా, బాబుఖాన్, మమ్మద్ యూనిస్ పటేల్, జాయింట్ సెక్రెటరీ అబ్దుల్ వాహబ్, అబ్దుల్ వాహబ్, జాకీర్ హుస్సేన్, షేక్ అద్నాన్, అర్బాస్, మహమ్మద్ అస్లాం, సయ్యద్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

పిట్లం : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో ముస్లిం సోదరులు బక్రీద్ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరీ సోదరీమణులు ఉదయాన్నే నూతన వస్త్రాలు ధరించి భక్తిశ్రద్ధలతో ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం హిందూ ముస్లిం భాయి భాయి అంటూ ఒకరినొకరు అలింగరం చేసుకుంటూ మతసామరస్యానికి ప్రతీకగా, శాంతి సామరస్యాలతో బక్రీద్ పర్వదిన శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మత గురువు పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

మహమ్మద్ ప్రవక్త బోధించిన సమైక్యతను పాటించాలి

ఎల్లారెడ్డి : త్యాగానికి, భక్తికి, విశ్వాసానికి ప్రతీక అయినటువంటి పవిత్ర బక్రీద్ పండుగను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ఎల్లారెడ్డి పట్టణంలోని దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు ముగించిన అనంతరం తారాసపడిన ముస్లిం మైనార్టీ నాయకులు, మాజీ జెడ్పీటీసి గయాజుద్దీన్‌తో పాటు ఎల్లారెడ్డి ముస్లిం సోదరులకు ఎల్లారెడ్డి ఎస్ఐ మహేష్ బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త బోధించిన సహనాన్ని, సమైక్యతను, సహోదర భావాన్ని అందరూ అనుసరించి కలిసి మెలిసి, సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.

రెంజల్ : మండలంలో బక్రీద్ పండుగను పురస్కరించుకొని ముస్లిం సోదరులు ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లిం సోదరుల మత పెద్ద ముక్తి హబీబ్ బెగ్ ఖురాన్‌ను అనుసరించి ప్రతి ముస్లిం శాంతియుత వాతావరణంలో తమ పండుగలను జరుపుకోవడమే కాకుండా, మహమ్మద్ ప్రవక్త బోధించిన పేదవారికి తాను సంపాదించిన డబ్బులో కొంత వారికి ఇవ్వాలని ఆయన సూచించారు. కుల మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని, మత విద్వేషాలను తమ మనసులో రాకుండా చూసుకోవాలన్నారు. మండలంలోని రెంజల్, సాటాపూర్, నీల, పేపర్‌మిల్, కందకుర్తి, వీరన్నగుట్ట, తాడుబిలోలి, బోర్గం, ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలను చేసి ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

నాగిరెడ్డిపేట్ : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో ముస్లింలు బక్రీద్ పండగను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయాన్నే ఈద్గాల వద్దకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరినొకరు అలింగనం చేసుకొని శుభాకాంక్షలు చెప్పుకొన్నారు.

సదాశివనగర్ : మండలంలోని ప్రతి గ్రామంలో బక్రీద్ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈద్గల వద్ద ఉదయం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం చనిపోయిన వారి సమాధులపై పూలు వేసి ప్రార్థనలు చేసి ఈద్గల వద్ద దానధర్మాలు చేశారు. బక్రీద్ పండుగ సందర్భంగా ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. మండలంలోని సదాశివనగర్, అడ్లూర్ ఎల్లారెడ్డి, పద్మాజివాడి, ధర్మారావుపేట్, కల్వరాల్ తదితర గ్రామాల్లో పండుగను ఘనంగా నిర్వహించారు.

రామారెడ్డి : త్యాగానికి ప్రతీకగా నిర్వహించే బక్రీద్ పండుగను ముస్లిములు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దర్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసి, ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డితో పాటు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీకి శుభాకాంక్షలు తెలిపారు.

వర్ని : ఉమ్మడి మండలాల్లో మైనారిటీ సోదరులు పవిత్ర బక్రీద్ పండుగను ఘనంగా నిర్వహించారు. పండుగ సందర్భంగా పలు పార్టీల ప్రజాప్రతినిధులు ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.



సదాశివనగర్ మండలంలో..



నాగిరెడ్డిపేట్ : ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ఎల్లారెడ్డిలో..



పిట్లం :



ఎడపల్లి మండల కేంద్రంలో..



రామారెడ్డి : షబ్బీర్ అలీకి సన్మానం



సదాశివనగర్ : ప్రార్థన చేస్తున్న ముస్లిం బాలుడు



నిజామాబాద్‌సిటీ : ముస్లింల ప్రార్థనలు



రెంజల్ : బక్రీద్ వేడుకల్లో చిన్నారులు